# నేనూ, సుమిత్రా

"శ్రీ విజయ"

ఇంటర్వెల్ అయింది. హాల్లోలైట్లన్నీ వెలిగాయి. ఒక్కసారి నాలుగు వేపులా కలయచూశాను. "కూల్ డ్రింక్స్ తాగుదామా" అంటున్న వీరిమాట వినిపించుకోకుండా ముందువరసలో ఒక అమ్మాయిని దీక్షగా చూస్తున్నాను. గులాబీ జార్జెట్ చీరా, బ్లూకలర్ బ్లౌజూ, తల్లో జాజులూ .... ఆ క్షణానే ఆ అమ్మాయి నాకేసిచూసింది. నిమిషంలో జ్ఞాపకం వొచ్చింది. విశాఖపట్టణంలో డాక్టరు రంగారావుగారమ్మాయి సుమిత్ర. ఆరేళ్ళ క్రితంమాట. సుమిత్రకూడా నన్నుగుర్తించిందల్లేవుంది. లేచివొచ్చింది. నా ప్రక్క ఛెయిర్ చూపి "జ్ఞాపకంవున్నానా?" అని పలకరించాను. సుమిత్ర పలువరుస తళుక్కుమనేట్టు నవ్వింది. "ఏమి సుమిత్రా? ఇప్పుడెక్కడుంటున్నారు? అమ్మగారు ఎక్కడున్నారు?" అన్నాను నేనామె చెయ్యి పట్టుకొని. సుమిత్ర "అన్నయ్య యిక్కడే ప్రాక్టీస్ పెట్టాడు. అమ్మా నేను యిక్కడ అన్నయ్య దగ్గిరే వుంటున్నాం. షైలాపూర్ లో యిల్లు కొన్నాడు అన్నయ్య. మనం స్కూల్ ఫైనల్ చదివేప్పుడు అన్నయ్య ఎమ్. బి. థర్డ్ ఇయర్ చదువుతూ వుండేవాడు. జ్ఞాపకం వుందా?" అంది నావేలి వుంగరం చూస్తూ. అది వీరిది సుమిత్ర వొంగి యీయనకేసి చూసి "మీ .." అంది. తలవూపాను. "మా భూషణం కూడా వొచ్చాడు. అడుగో!" అని వాళ్ళన్నయ్యను చూపింది. కూల్ డ్రింక్ తాగుతూ మర్నాడు వాళ్ళింటికి వెళ్ళేట్టు ప్రామిస్ చేయించుకుంది.

ఇంటికి వొచ్చాక ఆ అమ్మాయి ఎవరన్నారు వీరు.

"మీ కెప్పుడూ చెప్పలేదనుకుంటాను. మేం విశాఖపట్టణంలో వుండగా వీళ్ళనాన్నగారు డాక్టరు రంగారావుగారని వుండేవారు. రేండేళ్ళు కాటోలు కలిసి చదివాం. స్కూల్ఫైనల్ పాసైన ఏడే రంగారావుగారికి నైజాం ట్రాన్స్ ఫరయింది. అమ్మకీ. సుమిత్రవాళ్ళమ్మకీ మంచి స్నేహం. సుమిత్ర మంచి తెలివి తేటలు లేకపోయినా, పట్టుదలా, శ్రద్ధావున్న పిల్ల. కాని భయస్తురాలు. పిరికితనం ఎక్కువ" అన్నాను.

మర్నాడు సుమిత్రవాళ్ళింటికి బయలుదేరాను. సూర్యుడస్తమిస్తున్నాడు. వాళ్ళింటికి చేరేసరికి సుమిత్ర నాకోసం గేట్ లో వెయిట్ చేస్తోంది. నన్ను లోపలహాల్లో సోఫాలో కూచోబెట్టి తను లోపలికి వెళ్ళింది.

సుమిత్ర ట్రేలో కాఫీ తీసుకొచ్చింది. ఇంతలో వాళ్ళమ్మగారు వొచ్చారక్కడికి. "ఏమమ్మా విజయా? అంతా కులాసాగా వున్నారా? అమ్మ ఎక్కడ వున్నారు" అన్నారావిడ. "అమ్మ విశాఖపట్టణంలోనేవుందండీ. నేనిక్కడ ఎకనామిక్స్ లెక్చెరర్ గా వుంటున్నాను" అన్నాను. ఇంతలో సుమిత్ర "మరివారు" అంది. "ఫిజిక్స్ లెక్చెరర్" అన్నాను నేను ఫ్లవర్ వాజ్ కేసి చూస్తూ. "దాంపత్యం బావుందమ్మా" అన్నారావిడ పక్కగదిలోకి వెళ్ళిపోతూ. సుమిత్ర మొహంలో బాధ. వ్యధ కనపడ్డాయి నాకు. సుమిత్రతో "ఏమిటి విశేషాలు?" అన్నాను నేను. సుమిత్ర కిటికిలోనుంచి బయట గార్డెన్ వేపు చూస్తూ "విజయా? నా పరిస్థితులేమీ బావులేవు. నిరాశ నిండిపోయివుంది నా జీవితంలో" అంది బాధగా. కళ్ళలోనీళ్ళు మెరుస్తూ బుగ్గలమీదనుంచి జారాయి. నేను సుమిత్రని నావేపు తిప్పుకుంటూ" "ఏమిటిసంగతి? నాతోచెప్పవూ!" అన్నాను.

"మేము నైజాం వెళ్ళాక నాన్నగారు నాకు పెళ్ళి ప్రయత్నాలారంభించారు. దానితో నేను స్కూల్ఫైనల్ తోనే ఆగిపోయాను. నాన్నగారికి పెత్తండ్రి కూతురొకావిడ వుండేది. ఆవిడకి మంచి ఆస్తివున్నా ఆవిడ భర్త బిజినెస్ లో అదంతా పాడుచేశాడు. ఒక సమయంలో అత్యవసరంగాపదివేలు బిజినెస్కి కావలిసొచ్చిందట. లేకపోతే నష్టమొస్తుంది, మాకుబాగా పొలాలవీ వున్నసంగతి నీకుతెలుసుగా. ఆవిడ మానాన్నదగ్గిరకొచ్చి "అన్నయ్యా ఈసమయంలో కాపాడకపోతే వీల్లే'దని మొదలుపెట్టిందట. నాన్నగారు ఏమీఅనటానికివీల్లేక యిచ్చారుట. ఇది నా చిన్నతనంలో జరిగినసంగతి. కాని ఆ పదివేలూ కూడా వాళ్ళని రక్షించలేక పోయాయి. సంసారం చితికిపోయింది. ఆయనా పోయాడు. ఒక్కకొడుకూ, ఆవిడా. రెండెకరాల భూమి యివి నిలిచాయి. ఆవిడ ఒక్క కొడుకుని ఎల్లాగోఓలా చదివించుకొచ్చింది. నాకు పెళ్ళి ప్రయత్నాలు చేస్తుంటే అతను కలకత్తాలో గ్రౌండ్ యింజనీరుగా వర్క్ చేస్తున్నాడు. నాన్నగారి కతను నచ్చాడు. అందమూ, చదువూ ఉద్యోగమూ అన్నీ వున్నాయి. ఆస్తిలేక పోయిందని బాధలేదు. వెంటనే ఆవిడకిరాశారు. వాళ్ళిద్దరూవొచ్చి చూశారు నన్ను. అతనేదో నసగటం

విన్నాను. నాన్నగారు మేడమీద "చేసుకుంటే చేసుకోండి లేకపోతే నా పదివేలూ తెచ్చివ్వండి యిప్పుడు" అని కఠోరంగా చెప్పటం విన్నాను. ఆవిడ అతన్ని బతిమాలింది "మంచున్న పాళాన పదివేలూ ఎక్కడ తెచ్చివ్వగలం? పిల్ల నచ్చిందన్నాక యింకేమిటిరా?" అని కన్నీళ్ళు పెట్టు కుంటోంటే నేను మేడమీద నుంచి చూశాను. తల్లిమాట తీశెయ్యలేక కాబోలు వొప్పుకున్నాడు.

పెళ్ళి సక్రమంగా జరిగింది. మా అత్తగారితో నన్ను తీసుకురమ్మని చెప్పి వారు ముందు వెళ్ళిపోయారు. అత్తగారు నన్ను కలకత్తా తీసుకు వెళ్ళారు. ఆవిడ ఉన్నప్పుడు యీయన సరిగానేమాట్లాడేవారు. ఆవిడంటే కొంచెం భయముంది. ఓ నెల్లాళ్ళుండి ఆవిడ స్వగ్రామం వెళ్ళిపోయారు. ఆవిడవెళ్ళాక యీయన నాతో సరిగా మాట్లాడటం మానేశారు. "బంగళా ఆవరణదాటవ్. వొట్టి పిరికిమనిషివి తయారయ్యావు" అని పెద్దకేకలువేసి నన్ను వెంటబెట్టుకుని లేడీస్‌క్లబ్‌కి తీసుకెళ్ళి మెంబరుగాజాయిన్ చేశారు. క్లబ్ శక్రటరీ ఎమ్. ఏ. పాసైందిట. ఆవిడ వీరికి షేక్‌హాండ్యిచ్చి చాలాసరదాగా మాట్లాడింది. ప్రెసిడెంట్ కార్పొరేషన్ మేయరుగారి భార్య. ఆవిడ ఎడ్వొకేట్ కూడాను. వాళ్ళంతా యింగ్లీషులో నాతో మాట్లాడుతుంటే జబాబు చెప్పాలంటే వణుకొచ్చేది. తప్పు తప్పులుగా యింగ్లీషు దొర్లేది. నా తోటిమెంబర్సు రుమాళ్ళు మోహానికి అడ్డు చేసుకొనేవారు. చచ్చేటంత సిగ్గుతో మొహం కందిపోయేది ఇంటికొచ్చాక ఆసంగతి వీరితో చెబితో "అపును ఎల్లాగయితేనేం స్కూల్‌ఫైనల్ గ్రాడ్యుయేట్‌వి తయారయ్యావు. డబ్బు మాటొచ్చింది గ్నానీ లేకపోతే ఏ గ్రాడ్యుయేట్ నన్నా చేసికొని వుందును." అని విసుక్కొనేవారు. ఎల్లాగో చికాకులతో రెండు నెలలు గడిచాయి. "నిన్ను మీవాళ్ళ దగ్గిరకి తీసుకు వెడతాను పండుగకి పదమన్నారు" సరేనన్నాను. అంతే తను యిక్కడ రెండురోజులున్నారు వెళ్ళిపోయారు. మళ్ళీతీసికెడతాననే మాటేలేదు. ఈమధ్య ఉత్తరాలకీ జవాబులే వుండటంలేదు. మా అన్నయ్యకి అభిమానం మెక్కువా అత్తగారి మాటని కూడా తోసేసి వుంటారు" ఆమె కళ్ళలోంచి నీళ్ళు ధారా ప్రవాహంగా కారుతున్నాయి. నా వొళ్ళోకి వాలిపోయింది.

"చూడు సుమిత్రా! ఇవాళ్టినుంచి నీబాధ్యత నాది. రేపు సరిగ్గా నాలుగున్నరకి మాయింటికిరా. అప్పుడు ఆలోచిద్దాం" అనివోదార్చాను. ఇంటికి చేరేవరకూ నాకుఒకటే ఆలోచన. "సుమిత్రని మెరుగుపెట్టాలి" అనే నా మనసంతా నిండిపోయింది. యీ సంగతివొక్కటే.

మర్నాడు సంగతంతా వారికి చెప్పాను.

"సరే! యింకా సందేహిస్తావేం. సుమిత్రని కోచ్‌అప్ చెయ్యి" అన్నారు వరండా మెట్లు దిగుతూ. సాయంత్రం సరిగా నేను చెప్పిన టైముకే సుమిత్ర వొచ్చింది. మెల్లిగా ఆమెతో "చూడు సుమిత్రా! నీబాధ్యతంతా నామీదవెయ్. పట్టుదల తెచ్చుకో. మీవారు నిన్ను తనతో కలకత్తా తీసుకు వెళ్ళేట్టు చేస్తాను" అన్నాను. ఆమె కళ్ళలో ఏదోజ్యోతి వెలిగింది. అ ప్రయత్నంగా యిద్దరం కాలెండర్ చూశాం. ఏప్రిల్ మూడో తారీకురెపరెప లాడింది. నాసలహామీద వారంరోజుల్లో యింటర్‌మీడియేట్ బుక్స్ అన్నీకొనుక్కుంది. కష్టపడి చదవటం మొదలు పెట్టింది. నేను కాలేజీనుంచి వస్తుంటే దార్లో నన్ను పుస్తకాలతోవొచ్చి కలుసు కునేది. గిర్రున తిరిగి వొచ్చింది మార్చి మాకాలేజీలోనేఎపియరయింది. ఎగ్జామినేషన్స్ ఆఖరిరోజున వొస్తుంటేచూశాను. సుమిత్ర ఆవాళ నేను చూసినకంటే యీ పదకొండు నెలల్లోనూ చిక్కిపోయిందిన్ని అన్నిపేపర్లూ ధైర్యంగానేరాశాను విజయా! ఏమవుతుందోమరి" అంది.

రిజల్ట్స్ వొచ్చేశాయి. క్లాస్‌లో పాసయింది సుమిత్ర. కాలేజీలు తెరవగానే నేను వర్క్ చేస్తున్న కాలేజీలోనే ఎకనామిక్స్ ఆనర్స్‌లో జాయినయింది కాలేజీ... పరీక్షలూ తప్ప మరోదృష్టిలేదు సుమిత్రకి. ఎట్లాగడిచాయో మూడేళ్ళూను, ఆశ్చర్యం వేస్తుంది తలుచుకుంటే ఫైనలియర్ ఎగ్జామినేషన్స్ అయిపోయాయి. సుమిత్ర చాలా మారిపోయింది. లేడీస్‌క్లబ్‌లో శక్రటరీగా వుంటోంది మెంబర్సతో చకచకా మాట్లాడుతుంది. మెంబర్సంతా అడగటమే "మీనెంబరెంత?" అని నవ్వి వూరుకునేది. రిజల్ట్స్ వొచ్చాయి. క్లాస్‌రాక ఏమవుతుంది!

మర్నాడు వాళ్ళవారికి ఘాటుగా యింగ్లీషులోరాసింది వుత్తరం కలకత్తాలో ఏ కాలేజీలోనేనా లెక్చరర్ పోస్టు ఖాళీగావుందేమోనని. పదిరోజుల్లో రిప్లయి వచ్చింది. ఫలానకాలేజీకి ఎకనామిక్స్‌లెక్చరర్ కావాలనీ, స్వయంగా తీసుగెళ్ళటానికి వొస్తున్నాననీను.....సుమిత్ర బ్రెయిన్‌లో ఎక్కాక "గురుదక్షిణ ఏమిస్తావు?" అన్నాను.

సుమిత్ర చేతులు జోడించింది.